క్లుప్తంగా

సమగ్రాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కడియం: మండలంలోని మహిళా సంఘాల ప్రతినిధులు, సహాయకులకు సమగ్రాభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీఎం త్రిమూర్తులు మాట్లాడుతూ, గ్రామ స్థాయి ప్రణాళిక విధానంలో మహిళలను భాగస్వాములను చేయడం, స్వయం సహాయక సంఘాల ప్రణాళికల తయారీ, సంఘాలు, పంచాయతీరాజ్ సంస్థల మధ్య సమన్వయం, పేదరిక నిర్మూలనపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. స్త్రీనిధి ఏజీఎం మేరీ, ఏపీఎం ఏ.నాగలక్ష్మి, సీసీలు ఎం నాగభూషణం, యూబీజీ తిలక్, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కడియం: ప్రజలకు కృష్ణ భగవానుడి ప్రాశస్త్యాన్ని తెలియజేసేందుకు ఆయనకు ఊరేగింపు చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు అన్నారు. సంస్థ సభ్యులు మూర్తి, లక్ష్మీనారాయణ, విజయ్‌జయరాం, లోమిత, సూర్యకుమారి, రాణి, సరిత తదితరులు బుర్రిలంకలో త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ, పూర్వం కృష్ణాష్టమిని 11 రోజుల పాటు చేసే వారన్నారు. చివరగా చవితి రోజున ఊరేగింపు ముగిసేదని వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన

కంబాలచెరువు: సమాజంలో మితిమీరుతున్న సైబర్ నేరాలపై స్థానిక ప్రకాశ్‌నగర్, సైబర్ ల్యాబ్ పోలీసులు మంగళవారం బొల్లినేని పారా మెడికల్ విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్, స్కైప్‌లో అపరిచితులతో చాటింగ్ చేయవద్దన్నారు. అనవసర లింకులను, అప్లికేషన్లను క్లిక్ చేస్తే అనేక అనర్థాలు తప్పవన్నారు. సైబర్ నేరాలకు విద్యావంతులే ఎక్కువగా గురికావడం ఆందోళనకరమన్నారు. ఇటీవల టాస్క్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, కొరియర్ ఫ్రాడ్‌లో అపరిచితులు డాక్టర్ల వద్ద నుంచి రూ.కోట్లు కాజేశారన్నారు. అటువంటి విషయాలపై జాగ్రత్త వహించాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు వెన్నుపోటు


షట్టర్ బాషా

ధవళేశ్వరం: ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వంలో వెన్నుపోటు పొడుస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ మొహమ్మద్ కరీంబాషా (షట్టర్ బాషా) మంగళవారం ఇక్కడ విమర్శించారు. నర్సాపురంలో ఏఎంసీ చైర్మన్ పదవిని ముందుగా మైనార్టీలకు కేటాయించి, తిరిగి రిజర్వేషన్ మార్చడం దారుణమన్నారు. ముస్లిం మైనార్టీలపై చిన్నచూపు చూడడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: డిస్ట్రిక్ట్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ (డీబీసీఎస్) ఆధ్వర్యంలో ఆరు నుంచి 18 ఏళ్ల విద్యార్థులకు కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బొమ్మూరులోని డీఎండ్‌హెచ్‌వో కార్యాలయంలో దీనిపై సమావేశం నిర్వహించారు. మూడు నెలల పాటు జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బి శ్రీనివాస్, ఆర్‌పీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలోని కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ఓ లాడ్జిలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం, కర్నూలుకు చెందిన మొహమ్మద్ ఫరూక్(31) సోమవారం రాజమహేంద్రవరం వచ్చి లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. మర్నాడు 11 గంటలకు గడువు అయిపోవడంతో లాడ్జి సిబ్బంది తలుపు కొట్టగా, అతడు ఎంతకూ తెరవలేదు. అనుమానం వచ్చిన సిబ్బంది మారు తాళం చెవితో తలుపు తీయగా, ఫరూక్ విగత జీవిగా పడిఉన్నాడు. ఈ విషయమై లాడ్జి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా గదిలో పురుగు మందు డబ్బా లభించింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

కంబాలచెరువు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆళ్ల రవి అనే వ్యక్తిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు ఓ మహిళను రవి మోసం చేశాడు. దీనిపై ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ మహిళకు నారాయణపురానికి చెందిన మోర్త కమలకుమారి అండగా నిలిచింది. దీంతో రవి ఈ నెల 11న కమలకుమారికి ఫోన్ చేసి, కులం పేరుతో దూషించాడు. తన విషయంలో తప్పుకోకపోతే చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు కమలకుమారి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో తెలిపింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చినుకు పడితే.. నిండా మునకే..

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- వర్షం వస్తే పలు ప్రాంతాల్లో ముంపు సమస్య
- కార్పొరేషన్ అధికారుల అనాలోచిత నిర్ణయాల ఫలితం


ముంపునకు గురైన సాయిబృందావనం కాలనీ (ఫైల్)


జెమినీ గ్రాండ్స్ వద్ద డ్రైనేజీ దుస్థితి

రాజమహేంద్రవరం రూరల్: నగర భౌగోళిక, సాంకేతిక అవగాహన లోపంతో నగరపాలక సంస్థ తీసుకుంటున్న లోపభూయిష్ట నిర్ణయాలు నగరవాసుల కొంపలు ముంచుతున్నాయి. శాశ్వత ప్రాతిపదికన చేసిన నిర్మాణాలతో నగర ప్రజలు దీర్ఘకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో అస్తవ్యస్తంగా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో.. వర్షం వస్తే చాలు మోరంపూడి జంక్షన్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు ఉన్న ప్రాంతమంతా ముంపునకు గురవుతోంది. ఈ రోడ్డును ఆనుకుని ఉన్న కోనేరుపేటతో పాటు, శ్రీసాయి బృందావన్ కాలనీ సైతం ముంపునకు గురవుతుండడంతో ఆ ప్రాంతవాసుల ఇబ్బందులు వర్ణనాతీతం. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని పదో డివిజన్ పరిధిలో ఉన్న మోరంపూడి, హనుమాన్‌నగర్, సాయినగర్ నుంచి వర్షపు, వాడకం నీరు మోరంపూడి జంక్షన్ నుంచి కోనేరుపేట మీదుగా వెనుక వైపు ఉన్న డ్రైనేజీలోకి వెళుతుంది. అధిక వర్షం కురిస్తే.. డ్రైనేజీ సామర్థ్యం చాలకపోవడంతో కోనేరుపేట పూర్తిగా మునిగిపోయే పరిస్థితులు ఉండేవి. దీంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మోరంపూడి జంక్షన్ నుంచి భారీ డ్రైనేజీని శ్రీసాయిబృందావన్ కాలనీ వెనుక వైపు కాలువలో కలిసేలా నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో సాంకేతికపరంగా డ్రైనేజీ వాటం సక్రమంగా చూడకపోవడంతో భారీ వర్షం కురిస్తే చాలు ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం నుంచి పెట్రోల్ బంకు వరకు మోకాలు లోతు నీరు ఇరువైపులా నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. వర్షం తగ్గినప్పటికీ సుమారు రెండు గంటల పాటు నీరు పారే పరిస్థితి కానరావడం లేదు. వీఎల్‌పురం నుంచి మోరంపూడి వైపు వచ్చే డ్రైనేజీ వ్యవస్థ మరీ అధ్వానంగా ఉంది. డ్రైనేజీలో పూడికలు తీయకపోవడం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో.. వర్షపు నీరు సులువుగా పారే పరిస్థితి లేదు.

కనెక్టివిటీలు సరిగ్గా లేక..

పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోకి వచ్చే కోనేరుపేట ప్రాంతం, సాయిబృందావనం కాలనీలో డ్రైనేజీలు ప్రధాన డ్రైన్లకు అనుసంధానమయ్యేలా కనెక్టివిటీలు సక్రమంగా లేవు. వర్షం వచ్చినప్పుడు డ్రైనేజీల్లో నీరు వెనక్కు తన్నుతుండడంతోడాయా ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి కోనేరుపేట, శ్రీసాయి బృందావనం కాలనీ వీధులన్నీ పూర్తిగా మునిగిపోయాయి. మంగళవారం ఉదయం వరకు వర్షపు నీరు అలాగే నిలిచిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా ఆ ప్రాంత ప్రజలకు ముంపు సమస్య తప్పేటట్టు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి, డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో పరిశీలించాలని, డ్రైనేజీ కనెక్టివిటీలను సాంకేతికంగా సరి చేసి ముంపు సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నీట మునిగిన కోనేరుపేట ప్రాంతం (ఫైల్)


సాయిబృందావనం కాలనీలో పూడిపోయిన డ్రైనేజీ

ముంపు సమస్యను పరిష్కరించాలి



వర్షం వచ్చిన సమయంలో ప్రధాన డ్రైనేజీ నీరు లాగకపోవడంతో కోనేరుపేట, శ్రీసాయి బృందావనం కాలనీ, సబ్‌స్టేషన్ వద్ద పూర్తిగా మునిగిపోతుంది. ప్రధాన డ్రైనేజీకి చిన్న డ్రైనేజీల కనెక్టివిటీలు సరిగ్గా కలపకపోవడంతో ముంపు సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించి, ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– రాంబాబు, కోనేరుపేట

నర్సరీల అభివృద్ధితో పర్యాటకానికి ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: పర్యాటక రంగంలో కడియం ప్రాంతాన్ని ప్రత్యేకంగా నిలిపేందుకు నర్సరీల అభివృద్ధి చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పర్యాటక, హార్టికల్చర్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో పాటు, కడియం నర్సరీ సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడియం నర్సరీలు జిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. వాటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక విధానంలో సమగ్ర అభివృద్ధి అవసరమన్నారు. బోటింగ్, స్టాల్స్, కాఫీ షాప్, కాటేజీలు, పాటింగ్ మిక్సర్ వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ ఆర్గానిక్ వ్యర్థాల ఆధారంగా సేంద్రియ ఎరువుల తయారీ వంటి అనుబంధ కార్యకలాపాలు చేపట్టి ఆర్థికంగా నర్సరీ రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపులో భాగంగా, రాజమహేంద్రవరం ముఖ్య కూడళ్లలో, రహదారి డివైడర్లలో మొక్కల సంరక్షణకు నర్సరీ సంఘం ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ఇదే సమయంలో గ్రీన్ ఆర్గానిక్ వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి, భూసారాన్ని పెంచే చర్యలు చేపట్టడం వల్ల వాణిజ్యపరంగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆర్థికంగా వారిపై అదనపు భారం ఉండదని వివరించారు.

పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దే క్రమంలో తొలి దశలో పొట్టిలంక నుంచి కడియపు లంక వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర 28 స్టాళ్ల ప్రదర్శనతో పాటు, విక్రయాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీల పరిసరాల్లో కాటేజీలు ఏర్పాటు చేసి, పర్యాటకులకు విడిది వసతి కల్పించడం, బోటింగ్‌కు ప్రత్యేక ఆర్చ్ నిర్మాణం తదితర విషయాలపై చర్చించారు. పర్యాటకానికి తోడు నర్సరీ రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా నూతన మార్గాలు తెరుచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జేసీ ఎస్ చిన్నరాముడు, ఏపీఏఎంఐపీ పీడీ ఎ.దుర్గేష్, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎస్.మల్లికార్జునరావు, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, కడియం తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నర్సరీ సంఘ ఉపాధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి


ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: అభివృద్ధి పనుల్లో ప్రజావసరాలకు ప్రాధాన్యమిచ్చి అంచనాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డివిజన్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేల సామర్థ్యాన్ని బట్టి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. స్లమ్ ప్రాంతాల్లో పూర్తిగా సీసీ రహదారులే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. డ్రైన్ల నిర్మాణానికి టీడీఆర్ బాండ్లను దుర్వినియోగం చేసే పరిస్థితి తలెత్తరాదన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 17, 18, 19వ డివిజన్లలో మేజర్ డ్రైన్ నిర్మాణానికి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అంచనాలు సిద్ధం చేయాలన్నారు. పుష్కర పనుల్లో భాగంగా చేపట్టిన రోడ్ల విస్తరణ పనుల పురోగతిపై ఆరా తీశారు. నగరంలో నూతనంగా అభివృద్ధి చేసిన పార్కులను స్థానిక సొసైటీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లకు అప్పగించడం ద్వారా వాటి నిర్వహణ మరింత సులభతరం అవుతుందన్నారు. ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇంటర్, పాలిటెక్నిక్, టెక్నికల్, నర్సింగ్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక హైటెక్ బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది దాటినా ఇంటర్, టెక్నికల్, పాలిటెక్నిక్, నర్సింగ్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మండలానికీ ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని, టెక్నికల్ ఎడ్యుకేషన్, నర్సింగ్ విద్యార్థులకు ట్రైనింగ్ సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగాల కల్పన అంటూ ఎన్నికల హామీలు ఇచ్చారని చెప్పారు. గద్దెనెక్కిన వెంటనే అవన్నీ మరచిపోయారన్నారు. మాట్లాడితే గిన్నిస్ రికార్డులు, యోగాంధ్ర తదితర కార్యక్రమాలు తప్ప విద్యార్థుల సమస్యలకు పరిష్కారాలు చూపడం లేదని దుయ్యబట్టారు. కొన్ని కళాశాలల్లో లెక్చరర్, ప్రిన్సిపాల్ ఒక్కరే ఉన్నారని, అధికారుల తనిఖీలు ఉండవని అన్నారు. అధ్యాపకులు సరిగా లేక పాలిటెక్నిక్ విద్యార్థులు పరీక్షలు ఫెయిలై గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, స్విగ్గీ, జొమాటో, పేపర్స్ బాయ్స్‌గా పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం కింద అర్హులందరికీ రూ.15 వేలు ఇవ్వాలని కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.

నిబంధనల మేరకు జోన్ల గుర్తింపు


- పుష్కర ఘాట్ పూర్తిగా రెడ్ జోన్
- వీధి వ్యాపారులకు అన్యాయం జరగకుండా చర్యలు
- అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్


సమావేశంలో మాట్లాడుతున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఏ ఒక్క వీధి వ్యాపారికీ అన్యాయం జరగకుండా వీధులను జోన్ల వారీగా విభజించినట్టు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో టౌన్ వెండింగ్ కమిటీతో సమావేశం నిర్వహించారు. తొలి టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అనుసరిస్తూ, వీధి వ్యాపారుల చట్టం ప్రకారం పట్టణ ప్రణాళిక సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రెడ్ జోన్, యాంబర్ జోన్, గ్రీన్ జోన్లను గుర్తించినట్లు వివరించారు. నగర పరిధిలోని వీధులన్నింటినీ జోన్ల వారీగా విభజించి నివేదిక సిద్ధం చేసినట్టు తెలిపారు. విద్యా సంస్థలు, వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించినట్లు తెలిపారు. నిర్దేశిత సమయాలు, నిర్దేశిత రోజుల్లో వ్యాపారాలు చేసుకునే ప్రాంతాలను యాంబర్ జోన్లుగా, మిగిలిన ప్రాంతాలను గ్రీన్ జోన్లుగా ప్రకటించినట్టు వెల్లడించారు. నగర పరిధిలో 68 గ్రీన్, 17 యాంబర్, 63 రెడ్ జోన్లను గుర్తించినట్టు తెలిపారు. ఏమైనా సందేహాలుంటే తెలియజేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా పుష్కర్ ఘాట్ సర్కిల్‌ను పూర్తిగా రెడ్ జోన్‌గా ప్రకటించామన్నారు. కోటగుమ్మం శివుని విగ్రహం నుంచి పుష్కర్ ఘాట్ సర్కిల్ చివరి వరకు యాంబర్ జోన్‌గా గుర్తించినట్టు చెప్పారు. నగరంలో గతంలో 16 వేల మంది వీధి వ్యాపారులు ఉండేవారని, తాజా సర్వేలో 1,500 మంది కొత్త వీధి వ్యాపారులను గుర్తించినట్లు తెలిపారు. పెరిగిన వీధి వ్యాపారుల దృష్ట్యా గ్రీన్ జోన్ల సంఖ్యను కూడా గతంలో కంటే పెంచినట్టు చెప్పారు. వీధి వ్యాపారుల జీవనోపాధికి నష్టం వాటిల్లకుండా, స్పష్టమైన, నిర్మాణాత్మక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఈ సమీక్షలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బి.నాగలక్ష్మి, వి.కొండలరావు, ట్రాఫిక్ ఎస్సై అడపా శివాజీ, సీఎంఎం రామలక్ష్మి, ఫుడ్ లైసెన్స్ ఇన్‌స్పెక్టర్ రూకయ్య, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్


పర్యావరణ హితమైన ప్లాస్టిక్ సంచులను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాల్సిన అవశ్యకత నగర ప్రజలపై ఉందని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక జాంపేటలో ఆయన పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయా షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ విక్రయాలపై ఆరా తీశారు. నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని అమ్మవద్దని, అలా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 75 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లతో పాటు, డిస్పోజబుల్ గ్లాసులను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. అవి పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు, భూమిలో కలవటానికి కొన్ని వందల ఏళ్లు పడుతుందన్నారు. ప్లాస్టిక్‌ను ఇబ్బడిముబ్బడిగా వాడటం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు పర్యావరణ హితమైన వస్తువులనే వాడాలని సూచించారు. వ్యాపారులు, కొనుగోలుదారులు నగరపాలక సంస్థతో సహకరించి, ఇకపై జ్యూట్ బ్యాగులు, క్లాత్ సంచులను మాత్రమే వినియోగించాలని కోరారు. రాజమహేంద్రవరం నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

అమ్మ ఉత్సవం.. వైభవోపేతం


వేంకటేశ్వర మహత్మ్యం దృశ్య రూపకం


అమ్మవారి ఆలయానికి చల్లఘటాలు తీసుకొచ్చిన భక్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని ఇన్నీసుపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో 127వ కన్నమాంబ పేరంటాలమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా జరిగాయి. ఇన్నీసుపేట రెడ్డి రామాలయం నుంచి కన్నమాంబ పేరంటాలు అమ్మవారి ఘటాలను ఊరేగించారు. పూల గరగలు, గారడీ, బండ్ల వేషాలు, శక్తివేషాలు, వేంకటేశ్వర మహత్మ్యం నృత్య రూపకం, డీజే డాన్స్, బాణసంచా కాల్పులు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కన్నమాంబ అమ్మవారి ఘటాలను చివరిగా రైల్వేస్టేషన్ వద్ద ఉన్న కన్నమాంబ పేరంటాల అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లడంతో జాతర ముగిసింది. సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో టూటౌన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నర్సరీని సందర్శించిన సీఆర్పీఎఫ్ డీఐజీ


డీఐజీ అనిల్ మిస్ట్‌కు మొక్కను అందిస్తున్న పెదసత్యనారాయణ

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవ నర్సరీని సీఆర్పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అనిల్ మిస్ట్ మంగళవారం సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతు పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందించి స్వాగతం పలికారు. వివిధ రకాల మొక్కల ప్రత్యేకత, వాటి పెంపకం తీరును డీఐజీ ఆసక్తికరంగా తెలుసుకున్నారు. ఆయన వెంట కమాండెంట్ ధర్మప్రకాష్, డిప్యూటీ కమాండెంట్ నితీష్ ఉన్నారు.

విలువలతో పాటు క్రమశిక్షణ నేర్పాలి

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ చంద్రశేఖర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వైద్య విద్యార్థులకు విలువలతో పాటు, క్రమశిక్షణ నేర్పాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యులు విలువలతో ఉండాలని, అప్పుడే రోగులకు మేలైన సేవలు అందుతాయన్నారు. గతేడాది విద్యార్థుల అకడమిక్ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యాబోధన చేయాలని, వారిని నిత్యం పర్యవేక్షించాలన్నారు. ముందుగా వైద్య కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అక్కడి హెచ్‌వోడీలతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలను అడిగారు. వీసీని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ కెనడీ, ఇతర వైద్యాధికారులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ అక్కమాంబ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సూర్యారావు, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ గాయకుడు ముఖేష్ జయంతి


ముఖేష్‌కు నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్ మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ బాలీవుడ్ మధుర గాయకుడు ముఖేష్ చంద్ మాథుర్ జయంతి వేడుకలు స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నట గాయకులు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్‌మోహన్ మిత్ర అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 35 ఏళ్ల పాటు హిందీ నేపథ్య గాయకునిగా పలు విజయవంతమైన పాటలు పాడి, అందరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆర్కెస్ట్రా గాయనీ గాయకులు శ్రీపాద మిత్ర, వంక బాలకృష్ణ, హేమనళిని రమేష్, సూర్యకుమారి, శ్రీమన్నారాయణ, కె.నాగేశ్వరరావు, కృష్ణ, విశ్వనాథం, పోస్టల్ ప్రసాద్, హరి, జీవీఎస్ లక్ష్మీతులసి స్వర నివాళి గావించారు.

దైవంతో సహవాసం ఆనందమయం

కడియం: దైవంతో సహవాసం దివ్య ఆనందాన్నిస్తుందని బైబిల్ మిషన్ పాలకవర్గ సభ్యులు రెవరెండ్ ఎం.దేవదాసు అన్నారు. దామిరెడ్డిపల్లిలోని బైబిల్ మిషన్ మహిమ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సినాయి సన్నిధి సాధన కార్యక్రమంలో ఆయన సభాపతిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ ఆధ్యాత్మికత లేకపోతే మానవ జీవితం వ్యర్థమన్నారు. బైబిల్ లేఖనాలను బోధించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సాధకులు పాలు సుందర్, ఏసురత్నం, రత్నదీప్, గ్రేసీలు తమ సందేశాలనందించారు. బోధకులు యేసుపాదం, పాల్ దొరబాబు, ప్రసాద్, విజయభాస్కర్, విజయానందకుమారి, కిరణ్ కుమార్ ఏకీభవించారు. రెవరెండ్ డాక్టర్ రత్నరాజు, సరోజిని, స్వాతి, అనిరుధ్ ప్రేమ విందును అందించారు.